# కెరటం న్యూస్

( సామాన్యుడి ఆయుధం )

బుధవారం 12, జూన్ 2024 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన మీడియా సంస్థ




2

## మెరుగైన విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు: కలెక్టర్

## కబ్జా భూములు బయటకు తీస్తాం....



- ఎవ్వరినీ ఉపేక్షించేది లేదు
- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్

3



## నేడు పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల్లో మంత్రి పొంగులేటి పర్యటన

3

## ఖమ్మంలో రెండు రోజులు డిప్యూటి సీఎం భట్టి పర్యటన



- తుమ్మల, పొంగులేటితో కలిసి సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష
- 12న పాఠశాలల పుణ ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ
- మధిర నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన
- 13న సీతరామ ప్రాజెక్టు పనుల పరిశీలన

5




# మెరుగైన విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు: కలెక్టర్

**ఖమ్మం కలెక్టరేట్, జూన్ 11, కెరటం న్యూస్:** ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మెరుగైన విద్యా బోధనతో పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ స్థానిక రమణ గుట్టలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. అధికారులు, ఉపాధ్యాయులు, పిల్లలచే ర్యాలీగా, విద్య ప్రాముఖ్యత, ప్రతిఒక్కరు చదువుకోవాలనే నినాదాలతో ర్యాలీ కొనసాగింది. జిల్లా కలెక్టర్ ఇంటింటికి తిరుగుతూ, ఇంట్లో చదువుకొనే పిల్లలు ఉన్నది, ఏ పాఠశాలలో చదువుతున్నది అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యా ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని వారి పిల్లలను తప్పనిసరిగా చదివించాలని తెలిపారు. ప్రతి ఒక్క పిల్లవాడు పాఠశాలలో నమోదయ్యే దిశగా బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం జూన్ 6 నుంచి జూన్ 19 వరకు నిర్వహిస్తుందని ఆయన అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, సిబ్బంది ఇంటింటికి తిరిగి ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థుల నమోదు శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన వసతులు, ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో వస్తున్న మెరుగైన ఫలితాలను తల్లిదండ్రులకు వివరిస్తూ అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు అయ్యేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు కంటే మెరుగైన నాణ్యత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువు చెబుతారని, ప్రభుత్వ పాఠశాలల్లో



విద్యార్థుల యొక్క సంపూర్ణ అభివృద్ధిపై దృష్టి పెట్టడం జరుగుతుందని, బట్టీపట్టే విధానం కాకుండా పాఠ్యాంశాలు విద్యార్థులకు అర్థమయ్యే దిశగా వారికి వివరిస్తూ కొత్త బోధనా పద్ధతులను ప్రభుత్వ పాఠశాల్లో అమలు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందని, దీని ఫలితంగా ఇటీవలే వచ్చిన పదవ తరగతి ఫలితాల్లో జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తీర్ణత పెరిగిందని, ప్రైవేట్ కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలను సాధిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో ఎటువంటి ఖర్చు లేకుండా నాణ్యమైన విద్య, విద్యార్థులకు అందుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో రెగ్యులర్ గా ప్రతి నెల పేరెంట్, టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నామని, విద్యార్థుల పురోగతే లక్ష్యంగా ఎప్పటి కప్పుడు తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తూ కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ప్రపంచంలోని అనేక దేశాలు విఫలమైన చంద్రయాన్ ప్రయోగాన్ని మన భారత శాస్త్రవేత్తలు విజయవంతం చేశారని, అటువంటి శాస్త్రవేత్తలు సైతం ప్రభుత్వ పాఠశాలలోనే చదివారని, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య ఉచితంగా అందించడంతో పాటు వారికి అవసరమైన యూనిఫామ్, పాఠ్య, నోట్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పాలని, అనవసరంగా ప్రైవేటు పాఠశాలల్లో చేర్పి డబ్బు వృధా చేసుకోవద్దని, ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు ఐఐటి, నీట్ ఫలితాల్లో మంచి ప్రదర్శన కనబరుస్తున్నారని, క్రీడా పోటీలలో సైతం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అధికంగా రాణిస్తున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకునే విధంగా తల్లిదండ్రులు వారి పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అంతకుముందు కలెక్టర్ స్థానిక ఎన్ఎస్పి కాలనీ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల పనులను తనిఖీ చేశారు. పాఠశాలకు యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు వచ్చినది అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, క్రొత్తగా ఎంతమంది నమోదు అయ్యింది అడిగి తెలుసుకున్నారు. బడి బాట కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలుచేయాలని, డ్రాప్ అవుట్ అయిన పిల్లలను గుర్తించి, తిరిగి చదువుకునేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, ఖమ్మం అర్బన్ మండల విద్యాధికారి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు శంకర్రావు, పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నిదానపురం ముత్యాలమ్మ దేవాలయంలో చోరీ



**మధిర కరటం న్యూస్ ప్రతినిధి :** మధిర మండలం నిధానపురం గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారి దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం తలుపులకు వేసిన తాళం పగలగొట్టి అమ్మవారి వెండి వడ్డానం,వెండి నేత్రాలు , రెండు ఇత్తడిగంటలు , హుండీలోని సొమ్మును చోరీ చేశారు.

## భరత్ పూర్వ విద్యార్థులను ఘనంగా సత్కరించిన యాజమాన్యం

- **జేఈఈ మెయిన్స్,అడ్వాన్స్‌లలో ప్రతిభ చాటిన విద్యార్థులు**





**మధిర కెరటం న్యూస్ ప్రతినిధి:** మధిర పట్టణంలోని భరత్ విద్యా సంస్థలకు చెందిన పూర్వ విద్యార్థులు జల్లా పూజిత,రేగళ్ల.సాయి కౌశిక్ రెడ్డి, సిహెచ్ సాయి కుష్మిత ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశంలో ప్రతిష్టాత్మకమైనటువంటి క్యాంపస్లలో సీట్లు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ భరత్ విద్యా సంస్థల అధినేతలు శీలం విద్యాలత, వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శీలం విద్యాలత వెంకటరెడ్డి మాట్లాడుతూ ముందు కూడా జీవితాల్లో అత్యున్నత శిఖరాలకు చేరుకోవాలని తమ ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు నాయకులు బ్రహ్మారెడ్డి,విశ్వనాథం,సంగారావు,ప్రిన్సిపల్ జింకల కోటేశ్వరరావు,డీన్ రవీందర్ రెడ్డి,శశికళ, నాగరాజు, అజీమ్, భవాని,రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బడి బాటలో పాల్గొన్న జడ్పీహెచ్ఎస్ మడుపల్లి ఉపాధ్యాయులు,ఏఏపిసి కమిటీ,విద్యార్థులు



**మధిర కెరటం న్యూస్ ప్రతినిధి:**మంగళవారం జడ్పీహెచ్ఎస్ మడుపల్లి బడిబాట కార్యక్రమం లో హెచ్ఎం.తోట.నరసింహారావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీమతి కె.నాగమణి,సభ్యులు పాల్గొన్నారు. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభ కానున్న నేపథ్యంలో బడిబాట కార్యక్రమంలో విద్యార్థులు,ఉపాధ్యాయులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. 6వ తరగతిలో చేరే విద్యార్థులను కలిసి పాఠశాలకు ఆహ్వానించారు. 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు,నోటు పుస్తకాలు ఏకరూప దుస్తులు విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే ఇవ్వనున్నట్లు ఉపాధ్యాయులు బూసా కోటేశ్వరరావు తెలిపారు.

## పరుచూరి మురళి తల్లి మృతికి మంత్రి పొంగులేటి నివాళులు



**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్:** సీనియర్ కాంగ్రెస్ నాయకులు పరుచూరి మురళి తల్లి మృతి చెందడం పట్ల తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి విచారం వ్యక్తం చేశారు. నగరంలోని బైపాస్ రోడ్డులో గల వారి నివాసంలో ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆత్మకు శాంతి కలగాలని దేవుణ్ణి ప్రార్థించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, రాష్ట్ర విద్యాసంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయబాబు, కార్పొరేటర్ దొడ్డా నగేష్, మిక్కిలినేని నరేంద్ర, కొప్పెర ఉపేందర్, కొదాలి గోవిందరావు, బాణాల లక్ష్మణ్, బోడా శ్రావణ్, షేక్ ఇమామ్, ఉమ్మినేని కృష్ణ, కాంపాటి వెంకన్న తదితరులు ఉన్నారు.

## వివాహ కార్యక్రమానికి హాజరై వధు వరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు



**మధిర కెరటం న్యూస్ ప్రతినిధి:** మాటూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పుట్ట పుల్లారావు మేనల్లుడు శేషం మధుబాబు ఆకాంక్షల వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన మదిర మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సూరం శెట్టి కిషోర్, ధారా బాలరాజు సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ కర్నాటి రామారావు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అద్దంకి రవికుమార్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు బిట్ర ఉద్దండయ్య ,ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు పగిడిపల్లి డేవిడ్, మైలవరపు కోటేశ్వరావు, కొంగల ప్రసాద్ తదితరులు నూతన వధూవరులను ఆశీర్వదించారు.

### ఉరివేసుకొని యువతి ఆత్మహత్య

- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎర్రుపాలెం ఎస్సై



**మధిర కెరటం న్యూస్ ప్రతినిధి:** మంగళవారం ఉదయం ములుగుమాడు గ్రామానికి చెందిన షేక్ రెహానా బేగం తండ్రి మాబు సాహెబ్ 23 సంవత్సరాలు ఆమె తను గతంలోప్రేమించిన యువకుడు రంగాపురం గ్రామం ఇర్లపాడు మండలం ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఇస్లావత్ క్రాంతి కుమార్ గతంలో వేరొక అమ్మాయిని వివాహం చేసుకున్నందున సదరు రెహానా బేగం మధిర టౌన్ పోలీస్ స్టేషన్ నందు కేసు పెట్టగా పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదై క్రాంతి కుమార్ రిమాండ్ నిమిత్తం జైలుకు వెళ్ళగా పదిన బెయిల్ పై విడుదల అయిన విషయం తెలిసిన రెహానా బేగం మనస్థాపం చెంది మంగళవారం ఉదయం ఆరున్నర గంటల సమయంలో తన ఇంటిలో ఎవరు లేని సమయంలో చున్నీతో రేకుల పైపుకి ఉరి వేసుకొని చనిపోయినది. ఈ సంఘటనపై తన తండ్రి మాబు సాహెబ్ రిపోర్టు ఇవ్వగాఫిర్యాదు పై కేస్ చేసి ఎర్రుపాలెం ఎస్సై పి వెంకటేష్ దర్యాప్తు చేస్తున్నారు.

### నేడు పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల్లో మంత్రి పొంగులేటి పర్యటన

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్ :** తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల్లో బుధవారం పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా ఉదయం 06.30గంటలకు 59వ డివిజన్ దానవాయిగూడెంలో మున్నేరు ప్రొటెక్షన్ వాల్స్ పనులను సందర్శిస్తారని తెలిపారు. 10గంటలకు 60వ డివిజన్ రామన్నపేటలోని జెడ్పీహెచ్ఎస్ లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ లను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంలోని ఐడీవోసీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో అభివృద్ధి పథకాలపై మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి సమీక్షిస్తారని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఖమ్మం రూరల్ మండలంలోని దానవాయిగూడెం, రామన్నపేట, కామంచికల్, పాటివారిగూడెం, జాన్ బాద్ తండా , పడమటి తండా, దారేడు తదితర గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తారని తెలిపారు. కావున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై మంత్రి పొంగులేటి పర్యటనను విజయవంతం చేయాలని దయాకర్ రెడ్డి కోరారు.

# కబ్జా భూములు బయటకు తీస్తాం...

- ఎవ్వరినీ ఉపేక్షించేది లేదు
- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్

**వనం నాగయ్య, కెరటం న్యూస్:** వైశ్యకాంతల చెరువు, తామర చెరువు మరియు గాడుదుల వాగుల చెరువు ను అధికారులు తో కలిసి పరిశీలించిన సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ గారు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ గారు....సత్తుపల్లి పట్టణంలో వేశ్యకాంతల చెరువు మరియు తామరచెరువు,గాడుదుల వాగును ఈరోజు సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ గారు పరిశీలించారు. వేశ్యకాంతల చెరువు మెరక తూమును రిపేరు చేయవలసిందిగా రైతులు కోరగా వెంటనే ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం చెరువు మొత్తం పరిశీలిస్తూ చెరువుల్లో మిగిలిన పూడికను కూడా తీసే అవకాశాన్ని కూడా పరిశీలించాల్సిందిగా ఆదేశించారు.



వేశ్యకాంతల చెరువు కట్టమీద మరియు ఎన్టీఆర్ కెనాల్ కట్టమీద వర్షాకాలం ప్రారంభం కాగానే మొక్కలు నాటి సింగరేణి వారిచే సంరక్షణ బాధ్యత తీసుకునే విధంగా ఏర్పాటు చేయబడిందని తెలియజేశారు. అనంతరం ఎన్టీఆర్ కెనాల్ మీదుగా బేతుపల్లి చెరువు వరకు వెళ్లి కాలువను పరిశీలించారు. కాలవలో ఉన్న ముళ్ళకంపను శుభ్రం చేయవలసిందిగా ఇరిగేషన్ అధికారులు ఆదేశించారు. అనంతరం గాడిదల వాగును పరిశీలించి వాగు ఆక్రమణ లో ఉండటం వలన వరదలు వచ్చినప్పుడు ఇబ్బంది అవుతుంది అని ప్రజలు తెలియజేయగా ఆక్రమణలో ఉన్న వారిని తొలగించి వేశ్యకాంతల చెరువు వరకు గాడుదుల వాగు నుండి ఇబ్బంది లేకుండా నీరు వెళ్లే ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులు ఆదేశించారు. అనంతరం తామరచెరువు పరిశీలించారు. పోడు భూములను పరిశీలించారు. తామర చెరువు ఆయకట్టు రైతులు చెరువు తూములు పాడవడం వల్ల రైతులకు ఇబ్బంది కలుగుతుందని చెరువు కాంట్రాక్టు నాసిరకమైన పనులు చేయడం వలన ఈ ఇబ్బంది వచ్చిందని ఎమ్మెల్యే గారికి తెలియజేశారు...చెరువు భూములు ను సర్వే చేపించి భూ ఆక్రమణ జరగకుండా సర్వే రాళ్లు వేపించి ప్రభుత్వ భూములను కాపాడాలని అధికారులు ను ఆదేశించారు... ఏ పార్టీ వారైనా, ఎంతటి వారైనా సరే ప్రభుత్వ భూములు కబ్జా చేసి ఉంటే వారిని ఉపేక్షించేది లేదు అని తెలియజేసిన సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ గారు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ గారు... ఈ కార్యక్రమం లో సంబంధిత ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించాలి: కలెక్టర్





**ఖమ్మం కలెక్టరేట్, జూన్ 11, కెరటం న్యూస్:** ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పెద్ద ఎత్తున విద్యార్థులను చేర్పించాలని, బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో బడి బాట, అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పూర్తిపై విద్యాశాఖ, ఇంజనీరింగ్, మండల సమాఖ్యలతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ గ్రామాన బడిబాట కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి, బడీడు పిల్లలను గుర్తించి వారి వివరాలు సేకరించాలని అన్నారు. గుర్తించిన పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా కృషి చేయాలని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో 1 నుంచి ఐదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలని, ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాల కల్పన, ఇంగ్లీష్ మీడియం బోధనపై అవగాహన కల్పించి, వారిలో చైతన్యం తేవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతోనూ సమావేశం నిర్వహించాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చదువుకొని అప్ గ్రేడ్ అవుతున్న ఐదు నుంచి ఆరు సంవత్సరాల వయసున్న చిన్నారులందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనితో ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ, విద్యా బోధన, పై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మంచి గుర్తింపు వచ్చే అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ షెడ్డు, టాయిలెట్స్ మిగిలిన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అన్నారు. వారంలోగా పనులన్నీ పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. మహిళా సంఘాలే పనులు చేపట్టాలని, నిధుల మంజూరు విషయంలో ఎలాంటి జాప్యం జరగకూడదని ఆయన తెలిపారు. ఈ నెల 12వ తేదీ వరకు పాఠ్యపుస్తకాలు అందించడంతోపాటు యూనిఫామ్స్ విద్యాశాఖ అధికారులు సిద్ధం చేసి ఉంచాలని సూచించారు. పాఠశాలల్లో శానిటేషన్ సంబంధించిన పనులు చేపట్టాలని తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి సంబంధించి అన్ని వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు శాతం తక్కువ ఉన్నచోట పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలను సైతం మరింత బలోపేతం చేయాలని సూచించారు. పాఠశాలల పునఃప్రారంభం రోజున పాఠశాలలను అరటి, మామిడి ఆకులతో అలంకరణ చేయాలని, పండుగ వాతావరణం స్ఫూరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాల ప్రవేశం, ఆవరణలో వీధిదీపాల ఏర్పాటుచేయాలని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ , జడ్పి సీఈఓ ఎస్. వినోద్, డీఆర్డీఓ ఆర్. సన్యాసయ్య, డిఐఇఒ రవిబాబు, జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్ రెడ్డి, బి.సి. వెల్ఫేర్ అధికారి జ్యోతి, ట్రైబల్ వెల్ఫేర్ డి.డి. విజయలక్ష్మి, పంచాయతీరాజ్, మునిసిపల్, ఆర్ అండ్ బి ఇఇ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారా అమ్ముతున్న ఏడుగురు వ్యక్తులపై బైండోవర్ కేసులు

**కెరటం న్యూస్ ప్రతినిధి దుమ్ముగూడెం:** మండలంలో నాటు సారా గుడుంబా విచ్చలవిడగా అమ్ముతున్నారనీ ప్రజల నుండి పలు ఫిర్యాదులు రావడంతో పాటు ఇటీవల నరసాపురం గ్రామ మహిళలు దుమ్ముగూడెం తహసిల్దార్ కి నాటు సారాన్ని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు ఈ మేరకు ఎక్సైజ్ శాఖ అధికారులు పలువురు నాటుసార అమ్మే వ్యక్తులపై బైండోవర్ కేసులు పెట్టారు నరసాపురం గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులపై మారాయిగూడెం గ్రామానికి చెందిన ఒకరు బైరాగులపాడు గ్రామానికి చెందిన ఒకరిపై మంగళవారం ఎక్సైజ్ శాఖ అధికారులు బైండోవర్ కేసులు నమోదు చేసి ఈ ఏడుగురు వ్యక్తులను దుమ్ముగూడెం తహసిల్దార్ చంద్రశేఖర రావు ఎదుట హాజరపరిచారు భవిష్యత్తులో నాటు సారా అమ్మమని నాటుసార అమ్మకుందారులు మండల మెజిస్ట్రేట్ అయిన తాసిల్దార్ ఎదుట రాతపూర్వకంగా హామీ ఇచ్చారు

## కౌలు రైతులకు రైతు బరోసా ఇవ్వాలి

- **సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు**
- **సిపిఎం వైరా పట్టణ సభ్యుల రాజకీయ క్లాసులు ప్రారంభం**



**వైరా, కెరటం న్యూస్ ప్రతినిధి:** సిపిఐ(ఎం) వైరా పట్టణ పార్టీ సభ్యులకు రాజకీయ శిక్షణా తరగతులు స్థానిక మదు విద్యాలయంలో జరుగుతున్నవి. మంగళవారం జరిగిన రాజకీయ క్లాసులకు పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు చింతనిప్పు చలపతిరావు ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు. ఉదయం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు వర్తమాన రాజకీయాలు బోధించారు. నేడు అధికారం దక్కించుకొనే విధంగా దేశ రాజకీయాలు ఉన్నాయని, అధికారం కోసం ప్రజాసమస్యలు గాలికి వదిలేశారని, ఎన్నికలో గెలుపు కోసం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. భారత వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టివేయ బడుతుందని, వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పెరుగుతున్న వేడి వలన వ్యవసాయ పంటల దిగుబడులు తగ్గిపోతున్నాయని, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు చట్టబద్ధత కల్పించాలని అన్నారు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు వేంటనే ఎన్నికలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. మధ్యాహ్నం మతం-మతోన్మాదం క్లాసు వైరా స్టడీ సర్కిల్ కన్వీనర్ బోడపట్ల రవీందర్ బోధించారు. బిజెపి ప్రభుత్వం ప్రజల మధ్య మత విద్వేషాలను పెంచుతుందని, లౌకిక రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తుందని అన్నారు. ఈ క్లాసుల్లో పార్టీ వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, మల్లెంపాటి రామారావు, బొంతు సమత, హరి వేంకటయ్య, అనుమోలు రామారావు, రాచబంటి బత్తిరన్న, సంక్రాంతి నరసయ్య, గుడిమెట్ల మోహన్ రావు, గుమ్మా నరసింహారావు, శాఖా కార్యదర్శులు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి ఫ్రీడమ్ పార్క్‌లో రూ.3 కోట్ల అవినీతి

- **నిర్మాణం లోపాలన్ని స్వయంగా బయటకు తీసిన**
- **ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దంపతులు**
- **అక్రమార్కులను వదిలేది లేదని ఎమ్మెల్యే రాగమయి హెచ్చరిక**





**సత్తుపల్లి, కెరటం న్యూస్ ప్రతినిధి :** తామర చెరువు పరిశీలించిన అనంతరం తామర చెరువు కట్ట మీద నిర్మించిన ఫ్రీడమ్ పార్క్ ను సంబంధిత అధికారులుతో కలిసి పరిశీలించి పార్క్ నిర్మాణంలో జరిగిన నాణ్యత లోపాలను సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ స్వయ ంగా పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యం లో నిర్మించిన ఫ్రీడమ్ పార్క్ పూర్తి చెయ్యకుం డా కనీసం టైల్స్ వేసినప్పుడు సిమెంట్ కూడా వాడకుండా కేవలం మట్టి మీద టైల్స్ వేసిన సంఘటనను స్వయంగా అధికారుల ముందు బయటపెట్టిన డాక్టర్ మట్టా దయానంద్ ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ.. కేవలం డబ్బులు కోసం కాంట్రాక్టర్ నాసిరకం నిర్మాణం చేపట్టి ప్రభుత్వ డబ్బులను దోచుకున్నారు అని తెలిపారు. ఫ్రీడమ్ పార్క్ లో భారీ అవినీతి జరిగింది అని విచారించి అవినీతి ని బయటకు తీసి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి అని ఎమ్మెల్యే కి పిర్యాదు చెయ్యటంతో విజిలన్స్ అధికారులు తో దర్యాప్తు చేపించి బాద్యులు పై చర్యలు తీసుకుంటాము అని తెలిపారు. దయానంద్ మాట్లాడుతూ కేవలం ఒక్క తామర చెరువు కట్ట మీద సుమారు రూ.3 కోట్ల కుంబకోణం జరిగిందని తెలిపారు. అత్యంత దారుణం గా కనీస నిబంధనలు పాటించకుండా కేవలం డబ్బులు కోసం పార్క్ నిర్మించినట్లుగా బిల్లు లు పాస్ చేసుకున్నారు. పార్క్ లో ఆహ్లాద వాతావరణం కోసం మంచి మొక్కలు కూడా వెయ్యకపోవటం దారుణం అని తెలిపారు. పార్క్ నిర్మాణం లో అవినీతి పరులను కాంగ్రెస్ ప్రభుత్వం ఉపేక్షించదని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా దయానంద్ హెచ్చరించారు.

## పల్లవికి అపన్న హస్తం...

- **ఖమ్మం పే బ్యాక్ టు ది సొసైటీ, ఐ డి ఓ సీ ఉద్యోగుల చేయూత**



**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్:** ఖమ్మం నగరం ముంబై ఐఐటి లో ప్రవేశం పొందిన ట్రైబల్ ఏరియా పేదింటి బిడ్డ “పల్లవి” అపన్న హస్తానికి ఖమ్మం “పే బ్యాక్ టు సొసైటీ” & ఐడిఓసి ఉద్యోగుల అనూహ్య స్పందన ములుగు జిల్లా తాడ్వాయి ట్రైబల్ ఇంటిరియల్ మండలం నార్లపురం గ్రామానికి చెందిన సంకే పల్లవి దివ్యంగుడైన తండ్రి పోషాలు పది సంత్సరాల క్రితమే చనిపోగా, తల్లి అనారోగ్యంతో మంచాన ఉన్నా మొదటి నుండి బీటెక్ వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో నే చదివి గేట్ పరీక్షలో జాతీయ స్థాయిలో 104 ర్యాంకు సాధించి జూన్ ఒకటిన జరిగిన ఆన్లైన్ కౌన్సెలింగ్ లో ముంబై టాప్ ఐ ఐటి లో సీటు వచ్చిన 70 వేలు ఫీస్ చెల్లించలేని వార్తను సామాజిక మాధ్యమాల్లో చూసిన ఖమ్మం “పే బ్యాక్ టు సొసైటీ - ప్రమోటింగ్” ఎడ్యుకేషన్ వ్యవస్థాపకులు జంగం లక్ష్మణ్ రావు, పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. ప్రతాప్, హెల్త్ సూపర్వైజర్ జడ్. జైపాల్, విజయ్, ఎక్సైజ్ సీఐ కె. పోసేట్టి, అడిషనల్ డిఆర్ డిఓ, ఎండి.నురుద్దీన్ సూపరింటెండెంట్ నోముల పద్మ తదితరులు సొసైటీ %ఢ% జిల్లా కలెక్టరేట్ వాట్సాప్ గ్రూప్స్ లో పెట్టగా చలించి పోయి మానవత్వం ఉన్న ఉద్యోగులు కొందరు డిపిఆర్ఓ, ఎస్.శ్రీనివాస్, డి.రవి ఎస్ఓ సెక్రటేరియట్, జె. కిషోర్, అధికారులు డి.జగదీశ్వర్ ప్రసాద్, జి. ప్రతాప్, ఉద్యోగులు ప్రసాద్ రాజు, వి కిషోర్, ఉటుకూరు భాస్కర్ రావు, జి. సాయిబాబు, సుజాత, శ్రీలత తదితరుల పేదింటి బిడ్డ పల్లవి ఉన్నతి చదువుకోసం సపోర్టుగా నిలిచి సుమారు 30 వేల రూపాయలు ఫోన్ పే ద్వారా సహాయం అందేలా చేసిన వారందరికీ “పే బ్యాక్ టు సొసైటీ” వ్యవస్థాపకులు జంగం లక్ష్మణ్ రావు కృతజ్ఞతలు తెలుపుతూ పేదవాల్ల ఉన్నత చదువుకు డబ్బులైవని అక్షరం ఆగకూడదనే ఆలోచనతో పేదల విద్యకు చేయూత నిస్తూ సపోర్టుగా నిలుద్దామన్నారు. ఇంకా సహాయం చేయాల్సిన దాతలేవరైన ఉంటే ఎస్ పల్లవి 9391074472 ఫోన్ పే ద్వారా సహాయం చేయవచ్చును.

## కేంద్ర మంత్రులకు అభినందనలు తెలిపిన తాండ్ర వినోద్ రావు







**న్యూ ఢిల్లీ బ్యూరో, కెరటం న్యూస్ :** బీజేపీ నుండి ఖమ్మం పార్లమెంట్ కు పోటీచేసిన అభ్యర్థి తాండ్ర వినోద్ రావు నిన్న ఢిల్లీ లో నూతనంగా కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్, జ్యోతిరాదిత్య సింధియా, గజేంద్ర సింగ్ షేకావత్, లను మర్యాద పూర్వకంగా కలిసి వారికీ శు భాకాంక్షలు తెలియజేశారు.

## ఖమ్మంలో రెండు రోజులు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఖమ్మం లో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ నెల 12, 13న మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి సాగునీటి ప్రాజెక్టుల పనుల పరిశీలన, అధికారులతో సమీక్షతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పాలనపై ప్రత్యేక దృష్టి సారించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ఫోకస్ పెట్టారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు సాగు నీరు ఇవ్వాలన్న సంకల్పంతో ఇప్పటికే సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డితో కలిసి పలు మార్లు రాష్ట్ర సచివాలయంలో సమీక్షలు నిర్వహించారు. కాగా వాస్తవ పరిస్థితులను తెలుసుకోవ డానికి ప్రాజెక్టును ఈ నెల 13న మంత్రులతో కలిసి సందర్శిస్తారు. అధికారులు కాగితాల్లో చూపించిన పురోగతి, వాస్తవ స్థితిని పరిశీలించిన అనంతరం అక్కడే అధికారులతో సమీక్ష నిర్వహించి త్వరితగతిన ప్రాజెక్టు పూర్తి చేయడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి దశ దిశ నిర్దేశం చేయనున్నారు. పట్టువదలని విక్రమార్కుడిగా ఇందిరా, రాజీవ్ సాగర్ (సీతారామ) ప్రాజెక్టులను పూర్తి చేయడానికి భట్టి చాల పట్టుదలతో ముందుకు సాగుతున్న నేపథ్యంలో అధికారులు సైతం ఇందుకు తగ్గట్టుగా మంత్రుల పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేశారు.

**పర్యటన సాగుతుందిలా**

రెండు రోజుల పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు ఖమ్మం ఉమ్మడి జిల్లాలో ఇలా పర్యటిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల పుణ ప్రారంభం సందర్భంగా బుధవారం ఉదయం 10 గంటలకు ఖమ్మం ఎన్ఎస్‌పి క్యాంపు ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేయనున్నారు. ఆతరువాత ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, విద్య, సంక్షేమ పథకాల అమలు తీరుపై అధికారులతో శాఖల వారీగా సమీక్ష చేస్తారు. మధ్యాహ్నం 3 30 గంటలకు మధిర నియోజకవర్గం చింతకాని మండలం వందనం-పుట్టకోట, పాతర్లపాడు-గోవిందపురం గ్రామాల మధ్యన పంచాయతీరాజ్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఈ నెల 13న ఖమ్మం నుంచి ఉదయం 8.30 గంటలకు సీతారామ ప్రాజెక్టు సందర్శనకు బయలుదేరుతారు. ఉదయం 10గంటలకు దుమ్ముగూడెంకు చేరుకొని సీతారామ ప్రాజెక్టు పనులను పరిశీలిస్తారు. సీతారామ ప్రాజెక్టు లిఫ్ట్ ఇరిగేషన్ రెగ్యులేటర్, అశ్వారావుపేట మండలం బిజి కొత్తూర్లోని పంప్ హౌజ్, కెనాల్, ముల్కలపల్లి మండలం పంప్ హౌజ్-2, కమలపురం మండలం పూసుగూడెం లోని పంప్ హౌజ్-3, కెనాల్స్ పనులను పరిశీలిస్తారు. అలాగే కమలపురం వయా పాల్వంచ, కొత్తగూడెం, జూలూరుపాడు మీదుగా ఎన్కూర్ లింక్ కెనాల్ పనులను తనిఖీ చేయనున్నారు.

# ఆదివాసీల కల నెరవేరేనా..?

- **నత్తనడకన నడుస్తున్న బ్రిడ్జి పనులు**
- **మొక్కుబడిగా వచ్చి వెలుతున్న అధికారులు**
- **భయాందోళనలో ఆదివాసీలు..**





**గుండాల, కెరటం న్యూస్ ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం సాయనపల్లి పంచాయితీ లో గల చిన్న వెంకటాపురం, మల్లెల గుంపు వద్ద ఇసుక వాగుపై రెండున్నర కోట్ల రూపాయలతో వర్క్ ప్రారంభం చేశారు. బ్రిడ్జి పని దక్కించుకున్న కాంట్రాక్టు పనులు నత్త నడక నడిపిస్తున్న అధికారులు మాత్రం పట్టించుకో వడంలేదని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలం వస్తే వాగు పొంగడం రాకపోకలు నిలిచిపోవడం జరిగిన పట్టించుకునే వారు లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలం వచ్చిందంటే ఆదివాసీల గుండెల్లో గుబులు మొదలవుతాయని చెబుతున్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లి ప్రమాదాలకు గురైతే కనీసం మల్లెల గుంపు నుంచి మండల కేంద్రానికి రావడానికి కనీసం టూ వీలర్ కూడా వెళ్ళని పరిస్థితి అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవుడు కరుణించిన పూజారి కనికరించని తీరుగా ఆదివాసీల పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా పాలకులు మారిన ఆదివాసీల తలరాతలు మాత్రం మారడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయనపల్లి, వీరాపురం మధ్య ఫారెస్ట్ పర్మిషన్ లేక సుమారు 12 కిలోమీటర్ల రహదారి ఆగిపోతే అడవిలో పర్మిషన్ తేవడానికి టీఆర్ఎస్ పార్టీ 9 ఏండ్లు ప్రయత్నం చేసిన ఫలించలేదని, ఈ కాంగ్రెస్ పార్టీతోనైనా ఆ రోడ్డుకి పర్మిషన్ వచ్చి పనులు జరుగుతాయేమోనని ఆదివాసులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండలంలో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని కోరారు.

# నీట్ యూజీ 2024ను రద్దు చేయాలి

- **ఎన్ టి ఏ అధికారులకు చర్యలు తీసుకోవాలి: పీడీఎస్ యూ**




**ఖమ్మం ఎడ్యుకేషన్, కెరటం న్యూస్ ప్రతినిధి:** నీట్ యూజీ 2024 ఫలితాల్లో అవకతవకలు, పేపర్ లీకేజీకి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం PDSU ఆధ్వర్యంలో డాక్టర్ అకాడమీ నుండి గట్టయ్య సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది... ఈ సందర్భంగా పీడీఎస్ యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ క్రాంతి, జి మస్తాన్ లు మాట్లాడుతూ నీట్ యూజీ 2024 ఫలితాల్లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అవకతవకలకు పాల్పడి ఉజ్వల భవిష్యత్తు ఉన్న విద్యార్థుల జీవితాలతో చెలగాటం మాడిందన్నారు. జాతీయ స్థాయిలో నెంబర్ వన్ ర్యాంక్ 68 మందికి రావడం, దానిలో ఒకటే సెంటర్లో పరీక్ష రాసిన 8 మంది ఉండడం అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. దీని ద్వారా విద్యార్థులు తీవ్రమైన ఆందోళనలు గురవుతున్నారని మరికొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్దిష్టమైన ప్రమాణాలను పాటించకుండా గ్రేస్ మార్కులను ఏ విధంగా కలుపుతారని ప్రశ్నించారు. దీని ద్వారా అనేకమంది పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు డాక్టర్ చదువులకు దూరం అవుతున్నారని వాపోయారు. దేశంలో అతిపెద్ద పరీక్షా స్కామ్ గా నీట్ యూజీ 2024 మారిందన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు దీనికి వ్యతిరేకంగా పోరాడుతున్నారని కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని కోరారు. రద్దు చేయని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పిడిఎస్యు నాయకులు ఉదయ్ రామకృష్ణ శ్రీకాంత్ విద్యార్థులు పాల్గొన్నారు.

## 170 చట్టానికి వ్యతిరేకంగా బహుళ అంతస్తులు కడుతున్న నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్న లక్ష్మీ నగరం ములకపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శులు: ఏఎస్‌పి, ఏవి ఎస్‌పి ఆరోపణ

**కెరటం న్యూస్ ప్రతినిధి దుమ్ముగూడెం :** మండల కేంద్రం లక్ష్మీనగరంలో, ములకపాడ లలో ప్రధాన రహదారుల పక్కన రోజురోజుకీ అక్రమంగా 170 చట్టానికి వ్యతిరేకంగా బహుళ అంతస్తులు నిర్మిస్తున్న మండల కేంద్రం లక్ష్మీనగరం ములకపాడు గ్రామపంచాయతీల కార్యదర్శులు నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరిస్తున్నారని ఇదంతా చూస్తుంటే వీరే దగ్గరుండి ఈ అక్రమ నిర్మాణాలు జరుపుతున్నారని అనుమానాలు కలుగుతున్నాయని ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్తు సంఘాలు ఆరోపించాయి.మంగళవారం చిన్న నల్లబెల్లి గ్రామంలో ఆయా సంఘాల అత్యవసర సమావేశం జరిగింది ఈ సమావేశంలో ఏ వి ఎస్ పి భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు సోంది మల్లుదొర మాట్లాడుతూ ఆదివాసి చట్టాలను పంచాయతీరాజ్ శాఖ అధికారులు తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు ఏజెన్సీ ప్రాంతం మైన మండలంలో లక్ష్మీ నగరం ములకపాడు జాతీయ రహదారి గుండా ఉన్నటువంటి పంచాయతీ గ్రామాలలో 1/70 చట్టానికి విరుద్ధంగా ఎటు



వంటి అనుమతులు లేకున్నా విచ్చలవిడిగా బహుళ అంతస్తులు కడుతున్న వాటిని నిలుపుదల చేయాల్సిన పంచాయతీ కార్యదర్శులు నిమ్మకు నీరెతిన్నట్టుగా చూసిచూడనట్టుగా వ్యవహరించడం జరుగుతా ఉన్నది ఇటువంటి చట్టవిరుద్ధంగా వెలుస్తున్నటువంటి కొందరు గిరిజనేతర్ల అక్రమ భవనాలను అరికట్టడంలో రెవెన్యూ శాఖ తర్వాత పంచాయతీరాజ్ శాఖలో అధికారుల తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు దీనిపై పలుమార్లు పంచాయతీ కార్యదర్శులకు తెలియజేసిన పట్టింపు లేనట్టుగా వ్యవహరిస్తున్నారని వాపోయారు గిరిజనేతరుల ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా మేడ మీద మేడ కడుతున్న వారికి ఏ విధంగా అనుమతులు ఇస్తున్నారని ప్రశ్నించారు.